# పాలేరు

సీతయ్య రెండు సంవత్సరాల తర్వాత తిరిగి వూళ్లోకి వచ్చాడు. అతని దేహంలోగాని, ఆరోగ్యంలో గాని, మార్పేమీ కనబడ్డంలేదు. కాని, అతనికిమాత్రం ఊరంతా మారిపోయినట్లే కనబడుతోంది. అతనికి తెలిసిన మొట్టమొదటి మార్పేమిటంటే—

తాను జైలుకి పోయేటప్పుడు యాభై, అరవై రూపాయలకు కుదిరిన పాలేర్లు యిప్పుడు "వందకైనా రాము" అంటున్నారని–. ఎవణ్ణి కదిలించినా ప్రతివాడూ "యుద్ధం–అధికధరలు" అంటున్నారని.

ఈ విషయంలో సీతయ్య అంత తేలిగ్గా ఒప్పుకోడానికి వీల్లేదు. ఊరంతా చాలాభాగం ఆయన మాట మీాదే నడుస్తుందని ఆయనకు గట్టి నమ్మకం. అలాంటప్పుడు తానే మొట్టమొదటిగా రేటు పెంచితే–?

వాస్తవానికి సీతయ్య ఇతరులను గురించి అంతగా శ్రద్ధతీసుకునేరకం కాకపోయినా – తనవరకైనా నలుగురు పాలేళ్లకూ నాలుగొందలు చూస్తూ చూస్తూ ఎలా గుమ్మరించడం ?

దేనికైనా మంచిదని ఏదోఒక సీజనులో అలా జైలుకు వెళ్లివచ్చినా నిజానికి ఆయనకు వ్యవసాయం

మీదవుండే ప్రేమ అంతంతకాదు. నాలుగు అరకలు, నలుగురు పాలేళ్లు- దొడ్డినిండా పశువులు, కళకళలాడు తూవుంటే వుండే ఆనందం వేరే యెలా వుంటుంది.

అసలు మొదటినుంచీ సీతయ్య (వేలు పెట్టిం దల్లా బంగారం అవుతూ వచ్చింది. అందుకనే సీతయ్య జాతీయోద్యమంలో చేరేటప్పుడే "ఇందులో ఏదో లాభం వుంది. లేకపోతే సీతయ్య దిగకేం?" అనుకున్నారంతా. సీతయ్య స్వార్థాన్ని జాతీయోద్యమానికి ముడిపెట్టేశారు.

అదేమిటో! అచ్చగా అలాగే సీతయ్య ఒక నాయకుడు కావడం; ఆ పలుకుబడితో వ్యాపారం సాగిం చడం; అదీ దిలవలు పలవలై ఏపట్టణంలో చూచినా సీతయ్య వ్యాపారమే ఐపోయింది.

సీతయ్యకు ఎదురు మాట్లాడ్డానికి ఎంతలేసి వాళ్లూ అంతగా ధైర్యం చెయ్యలేరు. అలాంటిది రెండేళ్లు గడిచేసరికల్లా పాలేళ్లు – అందులోనూ రెక్కాడితేగాని డొక్కాడని రకం "వందయిస్తేగాని రాము" అంటు న్నారంటే ఎలా వుంటుంది?

ఎలాగైనా పదిమందిలో తిరగనేర్చినవాడు గనుక-ప్రతిదానికీ పట్టుమని కోపం తెచ్చుకోవడం ఆయన ప్రకృతికే పరమవిరుద్ధం గనుక – ఆ ఉక్రోషాన్నంతా

పుక్కిటనే పట్టేశాడు. వాళ్లే వచ్చి ముందుగా అడిగితే అప్పుడే వెళ్లగొట్టొచ్చని—

♦ ♦ ♦ ♦

ఏరువాక పున్నమ దగ్గరకొస్తోంది. ఏరోపున్నాన్నించి ఏరోపున్నానికి కాలచక్రానికి ఒకచుట్టు. ఇది పాలేళ్ల జీవితంలో ఒక సంవత్సరం.

సంవత్సరకాలంనుంచీ యజమాని సేవతో విసిగిపోయిన పాలేరు కొత్త యజమానికోసం తహతహ లాడుతుంటాడు. యజమానులుకూడా ఎలుకంత తిని ఏనుగంతపని చేసేవాడు ఎవడా? అని వెతుకుతుంటారు.

ఏరువాక పున్నమ వస్తుంది. కొత్త యజమానులు, కొత్త పాలేళ్లు, అంతా పదిరోజులపాటు కొత్తొకవింత.

తిరిగి కొద్ది రోజుల్లోనే తృప్తి అనేది ఎరుగని యజమాని 'గునుసుడు' సాగిస్తాడు. పాలేరు 'మెప్పులేని బండచాకిరీ' అనుకుంటాడు. క్రమక్రమంగా ఇద్దరి మధ్యా అగాధం పెరుగుతుంటుంది.

అధికమాసం రావడంతో కొత్త పేచీ ఒకటి ఉత్పన్నమయింది. కాలచక్రంలో అధికమాసాలు ఎన్ని రాలేదు? ఎన్నిపోలేదు? కాని పరిక్కనే న్యాయమైన హక్కులకోసమంటూ సాగుతూన్న అనేక పోరాటాల

పరిభావం యీా బానిసల్లోకూడా ఓ రకం చైతన్యాన్ని రగిలించింది.

"మేం పన్నెండుమాసాలే నౌకరీ చేస్తాం. కాని పదమూడు మాసా లెందుకు చెయ్యాలి?" అన్నారు పాలేళ్లు.

"పున్నమదాకా చేస్తేగాని సంవత్సరం కాదుగా." అన్నారు యజమాన్లు.

"ఇంగ్లీష్ తేదీవేసి లెక్కగట్టండి."

"ఛిఛిఛీ! ఇంటి లెక్కల్లోకూడా ఇంగ్లీష్ వాడి పొత్తేనా? ఇంకేం స్వరాజ్యంరా దేవుడా!" అని దిగులుపడ్డాడు, నిత్యం కోర్టులచుట్టూ ప్రదక్షిణాల్జేసే ఓ పక్కా పెద్దమనిషి.

"ఓహో! యిప్పుడు తెలిసింది. వీళ్లు అంత ర్జాతీయ దృక్పథంతో మాట్లాడుతున్నారు. వీళ్ళకి యీా అంతర్జాతీయత ఎక్కడనించి వచ్చిందో ఆలోచించండి. అమ్మో! అమ్మయ్యో!! పేడపిసుక్కొనే ముండాకొడుకు లకు రాజకీయాలు నేర్పితే దేశ మేమాతుంది? పారపనిలో పాకీస్థాన్, గడ్డివాములో కంఠశోష, జనపకోతలో జాతీ యైక్యత, రాజకీయాల్తో పనిగల్లంతు. దేశంలో కరువు కాటకం. తిరిగీ వీళ్ళంతా 'తిండిదొంగలు తిండిదొంగలు' అంటూ తెగ అరవడం. ఈ విషం ప్రబలకముందే మందు

వెయ్యాలి. రైతు సోదరులారా కళ్లు తెరవండి. మిమ్మల్ని ఆర్గనైజ్ చేస్తాను. ముందుండి నాయకత్వం వహిస్తాను.'' అని చిన్న లెక్చర్ దంచాడు, రోజు కో రకం మార్చే కోటేశం.

" నెలరోజులకోసం పోరాటమా? వెధవ పోరాటం — తీస్తే బడాబూర్జువామీద మొనాపలిస్టుల మీద తియ్యాలిగాని — ఎందుకొచ్చినపోరాటం? '' అన్నాడు ప్రతిదాన్ని ' మార్కిస్టు దృక్పథంతో ' అనే పడకకుర్చీ పాలిటీషియన్ కిష్టయ్య.

' ఎక్కువజీతం అడిగేటట్టున్నారే ' అనే దానితోనే మండుతోన్న యజమానులకు ఈ అధికమాసం పేచీ అగ్గిమీద గుగ్గిలం వేసినట్టయింది. అంతా ఒక్కసారి పోయి సీతయ్యమీదపడ్డారు.

'' ఆ విషయ మేదో నా దగ్గరే తేల్తుందిగా? మీరల్లా ఊరకేచూస్తూ నావెంట ఉండండి. '' అన్నాడు సీతయ్య.

సీతయ్యగారి పెద్దనౌకరు వెంకన్నకు ఇవేమీ పట్టవు. అదోరకంమనిషి. ' ఇలాంటి అధికమాసాలు రెండు కలిసివచ్చినా అతన్నేమీ కదల్చలేవు. కాని శివయ్యగారు ఇరవైరూపాయలు ఎక్కువయిస్తానన్నాడు. వెంకన్న కూడా ఒప్పుకున్నాడు. అందుకని సీతయ్యగారికిచెప్పి,

డబ్బు లెక్క చూచుకుందామనుకుంటున్నాడు. మూడు రోజులనుంచీ విశ్వప్రయత్నం చేస్తున్నాడు. సీతయ్యగారికి చెప్పాలని; కాని భయం. ఎట్టాగో గుండె రాయిజేసుకున్నాడు. వసారాలో కూర్చుని పత్రికచదువుకుంటూన్న సీతయ్యగారిముందు నిలబడ్డాడు. కిటికీ వూచలు జాగ్రత్తగా లెక్కపెడుతున్నాడు.

"ఏం రా? కొయ్యలాగా అలా నుంచున్నావ్?" అన్నాడు, సీతయ్యగారు ఆంధ్రపత్రిక క్రిందకు విసురుతూ.

"ఊఁ-ఊఁ-"

"ఊఁ- ఊఁ- ఏమిటిరా? తొత్తుకొడుకుల్లారా! మీ వ్యవహారం మరీ శృతిమించి రాగాన పడుతోందటే? కుర్రకుంక లేదో "కూలిపెరగాలి" అని కేకలు పెడితే మీరుకూడా దాన్నే లంకించుకుంటార్రా? హుఁ! తిందురుగాని రెండు చేతుల్తో—"

"అసలాళ్ళదగ్గిర కెప్పుడూ పోనండి. నాకా గొడవే తెలవదు."

"తెలవదు. తెలవదు. ఎలా తెలుస్తుంది? రేపట్నుంచీ బొచ్చెలు బెకబెకలాడుతుంటే-అప్పుడూ!"

"కాదండి. దొరగారూ! యింటికాడ మీ కమతగత్తె ఒకటేతీర్న గోలబెడతందండీ! జీతం సాలదని..."

శివయ్యగారేమో యిరవై రూపాయలు ఎక్కువిత్తా మన్నారంటా..."

"ఉహూం! యికనేం? ఆ ఎక్కువిచ్చే యిరవై యిలా నాకు గట్టిపో. పోతానంటే బ్రతిమాల్తా ననిరా నీయేడుపు? తొందరగా దయచెయ్!"

"డబ్బు లెక్కజూత్తే ఏరోపున్నందాకా చేసి పోతానండి."

"అధికమాసం చెయ్యరుగదటోయ్"

"అదంతా నాకేమీ తెలవదు దొరగోరూ! మీపాదాల దగ్గిర బతికేవాళ్లకి మాకీ అల్లరంతా దేనికండీ!"

"ఏమి నాటకాలురా! పో-యీ క్షణంనించీ నాదొడ్లో కనబడ్డావా!! డొక్క చీల్పాన్నన్నమాటే. ఫో! ముందు బజార్లోకిపోయి మాట్లాడు."

వెంకన్న కిదేమీ అర్థంకావడంలేదు. దొరగారికి త. మీద కోపం దేనికో? అలాగే నిలబడ్డాడు. వెంకన్నకి డబ్బుమీదే ప్రేమ. ఎన్నైనా తిట్టు-కొట్టు. డబ్బు ఖచ్చితంగా యిస్తేసరి.

"ఏం రా? యింకా అలానే నుంచున్నావ్. ఫో ముందు. పోతావా? గెంటించాలా?"

"దొర-గా-రూ! డబ్బు"

"నాలుగు నెల్లు నాగాలున్నాయిట గదరా! వాటికెవడ్రా? నీ అమ్మామొగుడు-"

"ఔనండి. మనబండి నడుంమీాదుగా పోయి నప్పుడు నాలుగునెల్లు నయంకాక రాలేదండి."

"నీవురాని నాలుగు నెల్లూ రోజుకు రెండు రూపాయలిచ్చి మనిషిని పెట్టారు. మొత్తం రెండువందల నలభై రూపాయలయింది. నీకు రావలసిన జీతం రెండు సంవత్సరాలకీ రెండుఎనభైలు నూటఅరవై రూపాయలు. పోతే యింకా ఎనభై రూపాయలు నీవేనాకు బాకీ. పెళ్లాం తెచ్చిన బఱ్ఱెపడ్డ వుంది గామాలుగా - తోలిపెట్టు! సరి పోతుంది."

వెంకన్నకు ఒక్కసారిగా పిడుగుపడ్డట్టయింది. సీతయ్య తిరిగీ పత్రిక చదువుకోడం మొదలు పెట్టాడు.

వెంకన్న కొయ్యబారిపోయాడు. నడుంమీా దుగా బండి పోయినప్పుడు నాలుగునెల్లు నానాఅవస్థ పడ్డాడు. వైద్యుడికి యిరవైరూపాయలు యిచ్చుకున్నాడు. తాను మళ్ళీ కాలు భూమ్మీాద మోపేదాకా యింటిల్లపాదీ పస్తులు పడుకుంటూ వచ్చారు. యిదంతాయెందుకు? దొరగారి పనికోసమేనా? ఐనా లెక్కలో నాలుగునెల్లు నాగాలు. పైగా చిల్లరఅప్పులు. అవన్నీ చాలక రెండేళ్ళ జీతమూచాలక యింకా ఎనభై ముడరా-"అమ్మయ్యో!"

వెనక్కు తిరిగాడు.

దొడ్లో పశువులన్నీ జాలిగా "ఉండు" మని బ్రతిమాలుతున్నాయనిపించింది. వాటిని విడిచి పోవడం కష్టమనిపించింది. ఔను. రెండేళ్ళపాటు ఆ యింట్లో ప్రతి వస్తువూ తనకు చెందిందిగానే వుంది. అన్నిట్నీ 'మన' అనే భావించుకున్నాడు.

కాని — రెండేళ్లు అరవచాకిరీ చేయించుకుని నాగాలక్రింద యింకా మొనభై తనకే రావాలనే ఆయన దగ్గర పనిచేసేదెట్లా ?

యీ గుంఝాటనతో బలవంతాన కాళ్ళని యింటిదారి పట్టించాడు. "రెండేళ్లు - రెండేళ్ళకష్టం-" ఆ రోజుల్లో —

తన మేనమామ కూతురు రోజల్లా కష్టపడి, చేతులుకంది, మోపెడు కందిమోళ్లు పీకి పెట్టుకున్నది. తాను న్యాయంగా ఆ మోపెడుమోళ్లూ సీతయ్యగారి చేలోవిగనక- పోట్లాడి మరీ లాక్కొచ్చి సీతయ్యగారి దొడ్లో పారేశాడు.

తన పెదతండ్రి గేదెల్ని సరిగ్గా కట్టివేసుకోక సీతయ్యగారి జొన్నచేను పాడుజేయిస్తోంటే - పెదతండ్రి అనైనా చూడకుండా బందెలదొడ్డికి తోలించాడు. ఐన వాళ్లతో తగువు తెచ్చుకున్నాడు.

పందులు పైరు పాడుజేస్తున్నాయని ఎరుకల వాళ్లతో తగువాడి తన్నులు తిన్నాడు.

ఆసామి ఎడ్లకి ఎక్కడ ప్రమాదం జరుగుతుందో నని గభీమని దూకి బండికిందపడి నడుం విరగ్గొట్టు కున్నాడు.

యివన్నీ ఎవరికోసం? యిందుకు ప్రతిఫలమే మిటి? రెండేళ్లు వృధా చాకిరి. పైగా యెనభైరూపా యల పైదండగ——

వెంకన్న యింటికి చేరుకున్నాడు.

సంగతంతా విని పెళ్లాం తిట్టడం మొదలెట్టింది. సీతయ్య దుర్మార్గాన్నీ, మొగుడి తెలివితక్కువనీ, కలిపి తిడుతోంది.

ఈ తిట్లు వింటే సీతయ్యగారు యింకా డబ్బి స్తాడా? ఇప్పటిదాకా "యిరొయ్యొచ్చు" అనే నమ్మకం వెంకన్న నో మూల పీడిస్తూనేవుంది.

"నోరుముయ్. ముయ్యవేం—" అంటూ వెంకన్న పెళ్లాన్ని గభీగభీ నాలుగు వుతికాడు. ఛిమఛిమ లాడుతూ ఎటో వెళ్లిపోయాడు.

సీతయ్యచేసిన పని ఊరంతా ఒక్కసారిగా గప్పుమన్నది. అందరూ 'దారుణం' అంటే —— కొందరు 'తగినపనే' అన్నారు.

"రైతూకూలి సామరస్యం, అంటారుగా—అదెలా తెస్తారో చూస్తా." అనుకున్నాడు కోటేశం.

ఆవేళ రైతులంతా సమావేశమౌతున్నారు. రైతుసంఘు ఆఫీసులో —

"అధికమాసం మూడు సంవత్సరాలకి ఒక్క-సారి వస్తుంది. కాబట్టి పాలేర్లు సంవత్సరానికి పదిరోజులు అధికంచెయ్యడం న్యాయం" అని తీర్మానించారు.

కోటేశం తెల్లమొగంవేశాడు. దేన్ని అర్గనైజు చెయ్యడమా ? అని —

"పాలేర్లు దీనికి ఒప్పుకోవాలిగా" అని తృప్తి పడ్డాడు. కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఎక్కడ వినబోయినా రైతుసంఘంవాళ్లు చేసుకున్న తీర్మానం న్యాయమేనని వినిపిస్తోంది.

ఆరాత్రే పాలేర్లంతా ఒకచోటికిచేరుతున్నారు.

ఆరాత్రే కోటేశంకూడా సీతయ్య పేరు మీదుగా రైతాంగాన్నంటూ కొందర్ని పిలిచాడు.

"ఈ విషయంలో అంతా ఒకటిగా ఉండాలనీ, అవసరమైతే పాలేళ్ళను పొరుగూరునించి పిలిపించాలనీ, ఎక్కువ డబ్బియ్యాల్సి వచ్చినా వాళ్ళకే యివ్వాలనీ, కాలు పొలాలుకూడా లాక్కుని అన్నివిధాలా కూలీలని లొంగదీయాలనీ,—కొన్ని తీర్మానాలుచేశారు.

నిద్రపోగా మిగిలిన వాళ్లెవ్వరూ ఎదురు చెప్ప లేదు. కోటేశం వుత్సాహం పట్టశక్యంకాకుండావుంది. ఆర్గనైజు చెయ్యడం అయ్యేపోయింది. యిక నడపడం ఎప్పుడా ? అన్న ఆదుర్దాలో వున్నాడు.

వెంకన్న ఆరాత్రి పాలేర్ల సమావేశానికి పోనే లేదు. కోటేశం బోధ బాగా వెంకన్న బుర్రకు పట్టింది.

శీతయ్య కోపానికంతకూ కారణం సంఘమే నని; ఊళ్లోకల్లా పెద్దరైతుని అలా ధిక్కరించడం క్షేమం కాదనీ, వెంకన్న వేరే సంఘంపెట్టి తనమాటల్లో వుంటే కాని ఆడబ్బు యివ్వడనీ కోటేశం చెప్పాడు. అంతే నన్నాడు వెంకన్న. అందుకే ఆ సమావేశానికి వెంకన్న పోలేదు.

కాని... ఎవరో యజమానులకు భయపడే వాళ్లు మినహాయిస్తే పాలేర్లంతా సమావేశమయ్యారు.

పెరిగే ధరలకు అనుగుణ్యంగా జీతాలు వుండా లనీ, అధికమాసం విషయంలో రైతులు తీర్మానించు కున్నట్టే ఏటా పదిరోజులు అధికంగా చెయ్యాలనీ, గుడ్డలు, చెప్పులు తీసుకోవాలనీ, నెలకొక్కరోజు సెల వుగా ఏటా 12 రోజులు నాగాలు కట్టరాదనీ యిలా తీర్మానాలు చేసుకున్నారు.

తెల్లవారే సరికల్లా-వెంకన్న పాలేర్లనందర్నీ

బండబూతులు తిడ్తున్నాడు.

పాలేర్లుమాత్రం వెంకన్న విషయం తేల్చుకోడానికి సీతయ్యగారింటికి వెళ్తున్నారు.

పాలేళ్లంతా సీతయ్యగారింటికి వెళ్లారు. వెనక పక్కన వెంకన్న తిడ్తున్నాడు. 'నాగొడవ మీకెందుకురా?' అని-. వెంకన్నని వెనక్కు యీడుస్తోంది పెళ్లాం.

కోటేశం యిదంతాచూచి ఏడవ వలసిందేకాని నవ్వుతున్నాడు అరుగుమీద కూచుని.

సీతయ్యకి వీళ్ల సందర్శ్నీ చూడగానే అరికాలి మంట నెత్తికెక్కింది. మీరంతా బందిపోటు దొంగలు నాయింటిమీదికి దొమ్మీకి వచ్చారు. కేసుపెట్టి దుంప తెగవేస్తా.''

''రెండేళ్ల వృధా చాకిరికంటే ఏమంత కష్టం కాదులెండి'' అన్నాడు వెంకన్న బావమరది.

''మాటలునేర్చిన కుక్కని 'జూ' అంటే 'ఇజ్జూ' అంటుందిరా. 'హరిజనులు హరిజనులు' అని గాంధీ మిమ్మల్ని మా నెత్తికెక్కించాడు. మేమూ ఎక్కించుకున్నాం. నీళ్లు తెప్పించడం, పక్కలు వేయించడం అంతా మీచేతేనాయె. యింక మీరు మా మాటెందుకు వింటారు?''

''ఇదిలేకముందే హాయిగావుండేది. యిప్పుడు

యింటో చాకిరీ, బయట చాకిరీ రెంటితో చస్తున్నాం.''

''చాకిరి చేయించుకుంటే యేం. అంటుకో రాని వాళ్లని పేరుపెట్టి యిచ్చేది తక్కువ జీతమేగా–''

''అసలు అదంతా ఎందుకోయ్. పాలేర్లంటే అచ్చగా అంటుకోకూడనాళ్లనేనా? మేము మాత్రం లేమూ–?''

వాళ్ళల్లోకల్లా పెద్ద ముందుకు వచ్చాడు. అందర్నీ ఆపాడు. అసలు విషయం ఎత్తుకున్నాడు.

''మీ పనిలోనే బండికింద పడ్డాడు. నిజానికి వాడి కుటుంబాన్ని ఆ నాలుగునెల్లూ పోషించాల్సింది మీరు. – పోనీ కనీసం ఆ నాగాలైనా కట్టుకోకుండా వుండండి''

సీతయ్య ససేమిరా అంటే ససేమి అన్నాడు.

''పోనీ ఆ నాగాలకు డబ్బు మినహాయించ డంలో — మీరు ఏ రేటున జీతం యిస్తున్నారో ఆ రేటు లోనే విరగగొయ్యండీ.''

''ఊహూఁ''

''ఇంత అన్యాయమైతే మీ దగ్గర యెవరుం టారు?''

''మెతుకులుండాలేగాని కాకులు కావలసి నన్ని–'' అన్నాడు సీతయ్య.

సీతయ్యగారింట్లో అప్పటిదాకా పనిచేస్తున్న ముగ్గురు పాలేళ్లూకూడా బయటికి వచ్చేశారు.

పొరుగూరినుంచి ఎవణ్ణేనా తెచ్చినా వాణ్ణి నిలవనీయడం లేదు. వాళ్లూ యీబోధలలో పడిపోతున్నారు.

చాలామంది రైతులు పాలేర్లను పెట్టుకుంటున్నారు. ఏటా పన్నెండు రోజులు సెలవులుకూడా ఒప్పుకుంటున్నారు. సీతయ్యకు మద్దత్తుగా వాళ్లుకూడా మెల్లమెల్లగా జారుతున్నారు. కోటేశం ఏమయ్యాడో!

ఏరోపున్నమి రేపు. రైతులంతా ఏరువాక సన్నాహాలు చేసుకుంటున్నారు. సీతయ్యకిమాత్రం తాడూ బొంగరం లేకుండావుంది. పైగా చేస్తున్న పనివాళ్లుకూడా మానుకుంటిరి.

ఆరాత్రే రహస్యంగా వెంకన్నడబ్బు వెంకన్నకి పంపించేశాడు.

మర్నాటి ఉదయం రైతులంతా పాలపొంగళ్లు చేశారు. ప్రతి యిల్లూ కళకళలాడుతోంది. సాయంకాలానికి అరకలకు పూజలు పూర్తయినాయి. ఎడ్లమొగాన వసుపుకుంకుమ పెట్టారు. కోటేర్లు సాగుతుంటే రైతు స్త్రీలు హారతులెత్తారు. రైతులు అరకలతోనూ పాలేళ్లు విత్తనాలతోనూ బయలుదేరారు. ఆ గొందినుంచీ యీ

గొందీనుంచీ అన్ని అరకలూవచ్చి ఊ కలుస్తున్నాయి. పాలేళ్లు జైమని జేజేలు కొడుతున్నారు.

అరుగుమీదినుంచీ గబగబా లోపలికి చూసుకుంటున్నాడు. సీతయ్య-

"నాలుగు రోజులుపాటు మొఖం తప్పిస్తే పోయేది. యీసారి మనకు లేబరులోనించి ఒక్క ఓటు పడితే ఒట్టుబెట్టు." అన్నాడు. చూచిపోదామని వచ్చిన మాళయ్య.

—:o:—

"పెద్దమనుష్యులని అనబడే వారిలో
వుండే స్వార్థం, సంకుచితత్వం,
అసూయ, నైచ్యం, ద్రోహబుద్ధి-
నికృష్ట మానవులనబడే వారిలో వుండవు."

— గోర్కీ.